క్లుప్తంగా

నేడు మార్కాపురంలో తిరంగా ర్యాలీ

మార్కాపురం టౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత ఆర్మీకి మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు గడియార స్తంభం సెంటరు నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మాజీ సైనికులు, పొదుపు సంఘాల ప్రతినిధులతోపాటు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో పాల్గొనేవారు జాతీయ జెండా తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు చెస్ పోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు వినిపించడం, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, బొమ్మలు గీయడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

సిపెట్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కంభం: విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్‌కు మే 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సులకు ఫీజురీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంటుందని, సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను జూన్ 28న నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా 150 సీట్లను భర్తీ చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9912973391ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు వెంట ఆక్రమణల తొలగింపు

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురం ఒకటో లైన్, నాలుగో లైన్‌లో డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన బంకులను మున్సిపల్ అధికారులు ఆదివారం తొలగించారు. రోడ్డు కుంచించుకుపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఆక్రమణలు తొలగిస్తున్నట్లు కమిషనర్ నారాయణరెడ్డి తెలిపారు. విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో షాపుల యజమానులు డ్రెయినేజీ దాటి ముందుకు రావద్దని సూచించారు. షాపుల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, షాపుల బోర్డులకు వ్యాపార ప్రకటన రుసుం చెల్లించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడంతోపాటు దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలి

మార్కాపురం టౌన్: ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత పెన్షన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పాత పెన్షన్ సాధించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ బాజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత పెన్షన్ లేక, హెల్త్ కార్డులు లేక, పీఆర్సీ, డీఏకు నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌పై సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా అమలు సంగతి మరిచిపోవడం శోచనీయమన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లకు పలు డిమాండ్లపై వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో రాయలసీమ 8 జిల్లాల్లో పూర్తిచేశామని, సోమవారం నుంచి నెల్లూరు మొదలు గోదావరి జిల్లాల వరకు రెండో విడత కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. 26 జిల్లాల యాత్ర పూర్తయ్యేలోపు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, కేసులు ఎత్తివేయాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే గుంటూరు–విజయవాడ మధ్య సెప్టెంబర్ 1న పెన్షన్ మార్చ్ చేపడతామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు తెలిపారు.

22న ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

బేస్తవారిపేట: స్థానిక జంక్షన్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 22వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు రిటైర్డ్ డీఎస్పీ తూము తిరుపతిరెడ్డి తెలిపారు. ఆకుపూజలు, భజన కార్యక్రమాలతోపాటు భక్తులకు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేయనున్నట్లు పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు వరం.. వేసవి శిక్షణ శిబిరం


ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు


వ్యాయామం చేస్తున్న చిన్నారులు

- క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

మార్కాపురం:

చిన్నారులకు చదువుతోపాటు శారీరక, మానసిక దారుఢ్యం ప్రధానం. కంప్యూటర్లు, ఆండ్రాయిడ్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ రాజ్యమేలుతున్న ప్రస్తుత రోజుల్లో చిన్నారులు క్రమంగా వ్యాయామం, క్రీడలకు దూరమవుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచుతూ దాతల సహకారంతో మార్కాపురంలో పలువురు కోచ్‌లు ఉచితంగా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థులకు వారికిష్టమైన క్రీడల్లో శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. వేసవిలో చిన్నారులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడా శిక్షణ ఇస్తూ, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

మార్కాపురం పట్టణంలోని రాయల్ స్పోర్ట్స్ అసోసియేషన్, దీక్షా యూత్ సర్వీసెస్ ఆర్గనైజేషన్, కోడి రామమూర్తి క్రీడా నట శిక్షణ సంస్థ నిర్వాహకులు ఏటా వేసవిలో ఉచిత క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నారు. మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ కళాశాల మైదానాల్లో 30 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, బాక్సింగ్ తదితర క్రీడలతోపాటు నటనలో శిక్షణ ఇస్తూ ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. తోటి విద్యార్థులతో ఎలా ఉండాలి, క్రీడల్లో ఎలా గెలవాలి, గెలుపోటములను ఎలా స్వీకరించాలనే విషయాలు తెలియజెబుతూ మానసికంగా దృఢంగా ఉండేలా తర్ఫీదునిస్తున్నారు. పిల్లల అభిలాషను గుర్తించి పలువురు తల్లిదండ్రులు రోజూ ఉదయం, సాయంత్రం శిక్షణకు తీసుకొస్తుండటం విశేషం. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తుండగా.. దాతల సహకారంతో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నారు.

వివిధ క్రీడల్లో శిక్షణ

వేసవి శిబిరానికి హాజరవుతున్న విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. బాక్సింగ్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, కర్రసాము తదితర అంశాల్లో మెళకువలు నేర్పుతున్నారు. మార్కాపురంలో రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉచిత శిబిరాలకు 120 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు కోచ్‌లు కాళంగి శ్రీనివాసులు, రహ్మతుల్లా పేర్కొన్నారు. వీరు ఉద్యోగాలు చేస్తూ ఏటా వేసవిలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఫుట్‌బాల్ నేర్చుకుంటున్నా



నా పేరు నాగలక్ష్మి, 9వ తరగతి చదువుతున్నా. నాకు ఫుట్‌బాల్ ఆట అంటే చాలా ఇష్టం. రఫీ మాస్టర్ వద్ద శిక్షణ తీసుకుంటున్నా. వేసవికాలంలో ఉదయం, సాయంత్రం సమయంలో శిక్షణ ఇస్తున్నారు. ఫుట్‌బాల్‌లో మంచి ప్లేయర్‌గా రాణించాలని ఉంది. ఉచిత శిక్షణ బాగుంది.

– నాగలక్ష్మి, మార్కాపురం

ఫుట్‌బాల్, వాలీబాల్‌లో శిక్షణ తీసుకుంటున్నా



నేను ఈ సంవత్సరం 10 తరగతి చదువుతున్నా. గత 10 రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉచిత క్రీడా శిక్షణా శిబిరంలో ఫుట్‌బాల్, వాలీబాల్ నేర్చుకుంటున్నా. మంచి ప్లేయర్‌గా రాణించాలని ఉంది. క్రీడాకారులకు రిజర్వేషన్ కూడా ఉంది. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనేది నా కల. మా కోచ్ ఆధ్వర్యంలో శిక్షణ బాగా జరుగుతోంది.

– జస్వంత్, 10వ తరగతి, మార్కాపురం

60 మందికి శిక్షణ



నేను గత ఏడేళ్ల నుంచి ఏటా వేసవిలో విద్యార్థుల కోసం ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని నెల రోజులపాటు నిర్వహిస్తున్నా. ఇప్పటికి సుమారు 800 మందికిపైగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చా. ఈ ఏడాది కూడా 60 మంది విద్యార్థులు ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర పోటీలకు ఉదయం, సాయంత్రం హాజరవుతున్నారు. ఉదయం పూట వివిధ రకాల వ్యాయామాలు, యోగా సాధన చేయిస్తున్నాం. జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తే ఉద్యోగాల్లో ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చే రిజర్వేషన్ వర్తిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలకు పంపాలి.

– రహ్మతుల్లా, కోచ్, మార్కాపురం

కమనీయం.. వేణుగోపాలస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న వేదపండితులు, ఉభయదాతలు


అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

కొనకనమిట్ల: స్థానిక రామదూత క్షేత్రంలో ఆదివారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం భక్తుల జయ జయ ధ్వానాల నడుమ కనుల పండువగా సాగింది. ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా వేదపండితుడు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలుగా ఎం.రమేష్‌బాబు, నివేదిత, జి.ఆంజనేయులు, మూర్తెమ్మ, జి.గురుస్వామి, నాగమల్లేశ్వరి దంపతులు వ్యవహరించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హాజరై ఉత్సవాలను తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నసంతర్పణ చేశారు. సోమవారం వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కంభం బస్టాండ్‌లో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ, ఎస్సై

కంభం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులపై చర్యలు తప్పవని కంభం సీఐ కె.మల్లికార్జున హెచ్చరించారు. కంభం ఆర్టీసీ బస్టాండ్, వైజంక్షన్‌లో ఎస్సై నరసింహారావుతో కలిసి ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు హెల్మెంట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తదుపరి చర్యలకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

అర్ధవీడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై బి.సుదర్శన్‌యాదవ్ సూచించారు. ఆదివారం పాపినేనిపల్లి నుంచి కంభం వెళ్లే రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోటా సత్యమాంబదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల వద్ద కోటా సత్యమాంబదేవి ఆలయం, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, సహస్ర నామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఆదివారమట.. వైద్యం చేయరట!


అసంపూర్తిగా తెరిచి ఉంచిన రాజుపాలెం పీహెచ్‌సీ


మూసి ఉన్న వైద్యాధికారి-1 గది


ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారి-2 గది

- రాజుపాలెం పీహెచ్‌సీలో అందుబాటులో లేని వైద్యులు
- ఉసూరుమంటూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న రోగులు

కొమరోలు: రోగులకు 24 గంటలపాటు సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం వైద్యం చేసే దిక్కులేరు. కొమరోలు మండలంలోని రాజుపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఆదివారం విధులకు హాజరుకాలేదు. ఉదయం 11 గంటల సమయంలో ఒక స్టాఫ్ నర్సు తప్పించి ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఆదివారం ఉదయం వైద్యులు డుమ్మా కొట్టడంతో రోగులు ఇబ్బందిపడ్డారు.

రాత్రి వేళ సిబ్బంది నిల్

పీహెచ్‌సీలో రాత్రి వేళ స్టాఫ్ నర్సు అందుబాటులో ఉండాలి. కానీ ఏ ఒక్కరూ విధులు నిర్వర్తించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యవసర సమయాల్లో గిద్దలూరులోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి రాజుపాలెం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలతో కుంకుమ బండ్ల ఊరేగింపు

ఘనంగా పేరంటాలమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో పేరంటాలమ్మ

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ–పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కుంకుమ బండ్లతో గ్రామోత్సవం వైభవంగా సాగింది. మహిళలు బోనాలు ఎత్తుకుని పేరంటాలమ్మ, పోలేరమ్మ ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కుంకుమ బండ్లకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, వైఎస్ జగన్ పాటలతో హోరెత్తించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే స్థానిక కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి అర్చకులు అమర్నాథ్ విశేషపూజలు నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

మార్కాపురం: ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో ఆర్యవైశ్య పేదలకు దుస్తులను ఆదివారం అమ్మవారిశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలైన మహిళలు, పురుషులకు చీరలు, పంచలను పంపిణీ చేశామన్నారు. అలాగే పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు, గాంధీ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి పి.కోటిమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుబ్బారావు, స్టేట్ మెంబర్ రామశేఖర్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, ఈసీ మెంబర్లు నాగేశ్వరరావు, లక్ష్మణరావు, కేశవరావు, చలమయ్య, సుబ్బారావు, రామకృష్ణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం


మార్కాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

మార్కాపురం: పట్టణంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజులుగా మార్కాపురం ప్రాంతంలో వర్షం కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడింది. ఎండ వేడిమి తగ్గడంతో ముఖ్యంగా వృద్ధులు, పిల్లలకు ఉపశమనం కలిగింది. చిరు వ్యాపారులు సైతం మధ్యాహ్న సమయంలో గత రెండురోజుల నుంచి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నప్పటికీ ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడు మృతి

మార్కాపురం: బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామం వద్ద చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కవలకుంట్ల రాజ్‌కుమార్(28) తమ గేదెలను మేపుకొని ఇంటికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో ఉన్న మహ్మద్‌సాబ్ కుంట దగ్గరకు రాగానే యర్రగొండపాలెం మండలం బోయలపల్లి గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి రాజ్‌కుమార్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి హుటాహుటిన మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం రూరల్ ఎస్సై అంకమ్మరావు తెలిపారు.